# అందరి గుండెల్లో ఉన్నది కేసీఆరే

- ఆయన చరిత్ర సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుంది
- కొడంగల్ నుంచే సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ సమాధి తథ్యం
- వరంగల్ సభ విజయంతో మైండ్ బ్లాక్ అయ్యి సీఎం పిచ్చిప్రేలాపనలు చేస్తున్నరు
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం




మోర్తాడ్, ఏప్రిల్ 30: తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ ప్రజలందరి గుండెల్లో ఉన్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ చరిత్రను సమాధి చేసేంత శక్తి, స్థాయి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని...తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులు కేసీఆర్ చరిత్ర సువర్ణ అక్షరాలతో లిఖించ బడి ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాలు విడుదల, బసవేశ్వరుడి జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వేముల ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రూ.2వేల పింఛన్ అసరా పెన్షన్ అవ్వతాతలు, బీడీ కార్మికుల చిరునవ్వుల్లో, రూ.4వేల పెన్షన్ అందుకున్న దివ్యాంగుల్లో, రైతుబంధు, రైతుబీమా పొందిన లక్షలాది మంది రైతుల కుటుంబాల్లో, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందుకున్న రాష్ట్రంలోని లక్షలాది ఆడబిడ్డల కుటుంబాల్లో , కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా పారుతున్న నీళ్లలో, ఎండాకాలం మత్తళ్లు దుంకిన చెరువులు, కాలువలు, చెక్‌డ్యాంల జలసవ్వడిలో, కులవృత్తిని నమ్ముకుని కేసీఆర్ ద్వారా లబ్ధిపొందిన యాదవులు, గొల్లకుర్మలు, మత్స్యకారులు, రజక, నాయీబ్రాహ్మణ, గౌడ సోదరుల జీవితాల్లో, గురుకులాల్లో ఇంగ్లిష్ మీడియం చదువుకున్న లక్షలాది విద్యార్థుల గుండెల్లో, అభివృద్ధి చెందిన ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఉపాధి పొందుతున్న యువకుల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా ఉంటాడని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడిన వ్యక్తిగా కేసీఆర్ పేరు తెలంగాణ చరిత్రలో కలకాలం లిఖించబడి ఉంటుందని తెలిపారు. 14 ఏండ్ల సుదీర్ఘపోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిగా, వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఉంచిన చరిత్ర కేసీఆర్‌ది అని పేర్కొన్నారు.

## ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి

ఓటుకు నోటు కేసులో ఒక ముద్దాయిగా ఒక ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు చరిత్రలో నిలిచిపోతుందని వేముల ఎద్దేవా చేశారు. లక్షలాది మంది తరలివచ్చి జన సంద్రం లాంటి వరంగల్ సభలో కేసీఆర్ తన పేరు కూడా తీయలేదన్న ఫ్రస్టేషన్‌లో రేవంత్ రెడ్డి ఉన్నాడని తెలిపారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో మైండ్ బ్లాంక్ అయ్యి రేవంత్‌రెడ్డి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

## చౌకబారు మాటలు మాట్లాడితే సమాధి కట్టడం ఖాయం

రేవంత్ ప్రభుత్వం ఇస్తానన్న రూ.4వేల పింఛన్, ప్రతిమహిళకు రూ.2500, తులంబంగారం, రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యానికి బోనస్, 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగభృతి, విద్యాభరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీ, కౌలు రైతుకు రైతుభరోసా, ఉపాధికూలీలకు, ఆటోకార్మికులకు రూ.12వేలు ఇవ్వడంలేదని, ఇది మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు. మంత్రులు, పార్టీ నాయకులే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడం లేదని, ఆయనను ప్రజలు కూడా గుర్తుపట్టడం లేదని, ఆయన గురించి కేసీఆర్ మాట్లాడాలా.అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ప్రజల్లో చులకన య్యారని, ముఖ్యమంత్రి హోదా మరిచి అసందర్భంగా చౌకబారు మాటలు మాట్లాడితే ప్రజలు త్వరలోనే ఆయనకు రాజకీయ సమాధి కట్టడం ఖాయమని వేముల హెచ్చరించారు.

# కాంగ్రెస్‌ది రాక్షస పాలన

- రైతుల ఇంట.. సర్కారు మంట
- కొనుగోళ్లు లేక అన్నదాతల కన్నీళ్లు
- వణికిస్తున్న అకాల వర్షాలు
- వారం రోజుల్లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి
- లేకుంటే పది వేల మంది రైతులతో డీఎస్‌వో, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



ఆర్మూర్-నిజామాబాద్ రోడ్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షస పాలన సాగిస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. పండిన పంటలు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతుల ఇంట కష్టాల మంట పెట్టిందన్నారు.

ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వరకు 27 కిలోమీటర్ల పొడవునా రోడ్డుపై కుప్పలు, తెప్పలుగా పోసి ఉన్న ధాన్యం రాసులను బుధవారం ఆయన పరిశీలించారు. పంటలు కొనే దిక్కు లేక పడిగాపులు గాస్తున్న రైతులను ఓదార్చారు. సర్కార్‌పై ఒత్తిడి తెచ్చి చివరి గింజ కొనుగోలు చేసే వరకు పోరాడుదామని ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కొనే దిక్కులేక దిగాలు చెందుతున్న రైతులను చూసి గుండె తరుక్కుపోతున్నదని కంటతడి పెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కొనుగోళ్లు లేక అన్నదాతలు కన్నీళ్లు దిగమింగుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల భయం అన్నదాతలను వణికిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నదాతల వెతలపై అధికార యంత్రాంగానికి పట్టింపులేదని, కనీసం అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని, ఫలితంగా రైతుల కష్టం దళారుల పాలవుతుందన్నారు.

### అధికార పార్టీ నేతలెక్కడ?

నమ్మి ఓటేసిన రైతులనే కాంగ్రెస్ ప్రభుత్వం కాటేసిందన్నారు. రుణమాఫీ, రైతుభరోసా పేరుతో దగా చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా, 24 గంటల కరెంట్ ఇస్తామని సిద్దుల గుట్టపై శివయ్య సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుకున్న ఒట్లు ఏమయ్యాయని నిలదీశారు. అన్నదాతలు ఆపదలో ఉంటే అధికార పార్టీ నేతలెక్కడ నిద్రపోతున్నారని మండిపడ్డారు. రైతులు గోస పడుతుంటే జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాబోయే మంత్రినని చెప్పుకుంటున్న సుదర్శన్‌రెడ్డి ఎందుకు ముఖం చాటేశారని ప్రశ్నించారు.

అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే రైతులకు మూడు రెట్లు అధికంగా పరిహారం చెల్లించే బాధ్యత సర్కార్‌దేనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా రైతులకు నష్టం జరిగితే ఇన్‌చార్జి మంత్రి జూపల్లి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఎస్‌వో

జిల్లా రైతుల కష్టాలపై డీఎస్‌వో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రైతులను పురుగులను చూసినట్లు చూస్తున్నారని మండిపడ్డారు. డీఎస్‌వో తీరు మారకుంటే రైతుల కోపాగ్నిని చవిచూడాల్సి ఉంటుందన్నారు. ఆర్మూర్ గడ్డ రైతుల అడ్డా అని, తమతో పెట్టుకున్నోళ్లెవరూ బాగు పడలేదన్నారు. వారం రోజుల్లోగా పంటల కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పది వేల మంది రైతులతో డీఎస్‌వో, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తానని హెచ్చరించారు.

### కేసీఆర్ పాలన స్వర్ణయుగం

కేసీఆర్ పదేండ్ల పాలనలో రైతులకు ఏ కష్టం రాలేదని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. కేసీఆర్ పదేండ్ల పాలన రాష్ట్ర రైతులకు స్వర్ణయుగమని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మార్పు పేరుతో అధికారంలోకి వచ్చినా ఎలాంటి మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు చూస్తుంటే ఆర్మూర్‌లో నాడు బకాయిలు చెల్లించాలని అడిగిన పాపానికి కడుపులో బుల్లెట్లు దింపిన నాటి కాంగ్రెస్ రాక్షస పాలనే గుర్తుకొస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత తెలంగాణలో మళ్లీ రాతియుగం వచ్చిందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ వస్తేనే తమ కష్టాలు గట్టెక్కుతాయని రైతులు కుండబద్ధలు కొట్టినట్లు చెబుతున్నారని జీవన్‌రెడ్డి తెలిపారు.

# అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు!

- లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం!
- ఇండ్లు ఉన్నవారి పేర్లు మొదటి జాబితాలో..
- లేని వారి పేర్లు మూడో జాబితాలో
- ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లలో నర్సరీ ఏర్పాటు
- స్థలం చూపిస్తే ఇల్లు కట్టుకుంటామని
- ఏండ్లుగా తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు



నాగాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం తవ్విన గుంతలు

మోర్తాడ్, ఏప్రిల్ 30: రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం నెలకొన్నది. అనర్హులను ఎంపిక చేశారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇండ్లు లేనివారిని, ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చిన వారిని ఎంపిక చేయకుండా, ఇండ్లు ఉన్నవారిని ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాగాపూర్ గ్రామంలో 84 కుటుంబాలను ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేశారు. ఇందులో దాదాపు ఇండ్లు లేని వారు, ఇండ్లు అవసరం ఉన్నవారందరూ ఉన్నారు. కానీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో చాలా పొరపాట్లు చోటుచేసుకున్నాయి. ఇండ్లు లేక ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లు ఉన్నవారిని మొదటి జాబితాలో కాకుండా మూడో జాబితాలో ఎంపిక చేశారు. ఏండ్ల తరబడి అద్దెకు ఉంటూ ఇల్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్న తమలాంటి వారిని మూడో జాబితాలో ఎంపిక చేయడంపై లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.


### అధికారులు వెంటపడ్డ ముందుకు రాని లబ్ధిదారులు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల ఎంపికలో లోపాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో మొదటి జాబితాలో ఎంపికైన లబ్ధిదారులు ఇండ్లు కట్టడానికి ముందుకురావడం లేదు. ఇప్పటికే ఎంపీడీవో పలుమార్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మాణాలు చేపట్టాలని, డబ్బులు లేకపోతే మహిళాసంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పడం, ఇండ్లు కట్టుకునేందుకు ముందుకు రాకపోతే అనర్హులుగా ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ఇండ్ల నిర్మాణం చేపట్టిన తర్వాత ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోతే ఎలా అనే అనుమానాలు వ్యక్తంచేస్తూ ఇండ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని తెలిసింది.

### పేదల స్థలాల్లో నర్సరీ ఏర్పాటు

1999లో అప్పటి ప్రభుత్వం గ్రామంల 32 మందికి ఇండ్ల స్థలాలను కేటాయించింది. ఒక్కొక్కరికీ 150గజాల స్థలాన్ని కేటాయించి, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను కూడా అందజేశారు.ఇందులో ఆర్థిక పరిస్థితి బాగోలేక చాలా మంది ఇండ్లు కట్టుకోలేదు. అలాంటివారికి స్థలాల్లో నర్సరీని ఏర్పాటు చేశారు. దీంతో చేసేదేమీ లేక తమకు ఇండ్ల స్థలం చూపించాలని ప్రభుత్వం ఇచ్చిన ధ్రువపత్రాలను పట్టుకుని ఏండ్ల తరబడి అధికారుల చుట్టు తిరిగినా ఫలితం లేకపోయింది. నర్సరీని ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్థలంలోనైనా ఏర్పాటు చేయవచ్చు. కానీ పేదలకు కేటాయించిన ప్లాట్లలో నర్సరీని ఏర్పాటు చేయడంతో ఏం చేయాలో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాక ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలోనైనా తమకు న్యాయం జరగుతుందన్న ఆశతో ఉన్న వారికి నిరాశే ఎదురయ్యింది. నర్సరీని తొలగించి తమ స్థలాలు చూపిస్తే ఇండ్ల కట్టుకుంటామని, ఇప్పటికైనా తమ స్థలాలను చూపించాలని అధికారులను కోరుతున్నారు.

చెడబోయిన లక్ష్మికి 150గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు అధికారులు ఇచ్చిన ధ్రువపత్రం




### విషయం మా దృష్టికి వచ్చింది

చెడబోయిన లక్ష్మి విషయం మా దృష్టికి వచ్చింది. వారు అద్దెకు ఉంటున్న ఇల్లు దాబా ఇలు కావడం అదే విషయాన్ని యాప్‌లో ఫీడ్ చేయడంతో వారిపేరు మూడో లిస్ట్‌లోకి వెళ్లింది. ఈవిషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అటువంటి వారు ఉంటే వారందరిని మొదటి లిస్ట్‌లో చేరుస్తాం. స్థలం మాత్రం రెవెన్యూ అధికారులు చూపించాల్సిన అవసరం ఉంది. లబ్ధిదారుల ఎంపిక విషయంలో పారదర్శకత వహించాం.

-రాజశ్రీనివాస్, ఎంపీడీవో, కమ్మర్‌పల్లి



### ఏండ్ల తరబడి కిరాయికి ఉంటున్నం..

మాకు సొంతిల్లు లేదు. ఏండ్ల తరబడి మేం కిరాయి ఇంట్లో ఉంటున్నం. బాకీలవడంతో నాభర్త వేరే దేశానికి పోయిండు. బాకీలు తీరినయి కదా ఇల్లుకట్టుకుందమనుకుంటున్నం. మాకు గవర్నమెంట్ ఇచ్చిన జాగ చూపించాలని తిరుగుతున్నా ఎవరూ పట్టించుకుంటలేరు. మేం కిరాయికి ఉంటున్న ఇల్లు దాబా ఇల్లు కావడంతో మా పేరు మూడో లిస్టులో వేసింద్రని చెప్తుంద్రు. మా జాగా మాకు చూపించి మమ్మల్ని మొదటిలిస్ట్‌లో చేరిస్తే వెంటనే మేం ఇల్లు కట్టుకుంటం.

-చెడబోయిన లక్ష్మి, నాగాపూర్

# ఫత్తేనగర్ భూములకు పట్టాలు ఇప్పించండి






తమ భూములకు పట్టాలు ఇప్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు విన్నవిస్తున్న ఫత్తేనగర్ రైతులు

నవీపేట,ఏప్రిల్ 30: కొన్నేండ్లుగా తమ భూములకు పట్టాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలతోపాటు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రయోజనాలు అందక తీవ్రంగా నష్ట పోతున్నామని, భూ భారతి చట్టం ద్వారా నైనా తమ భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ఫత్తేనగర్ గ్రామ రైతులు మొర పెట్టుకున్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో బుధ వారం నిర్వహించిన భూ భారతిపై అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. సదస్సుకు ఫత్తేనగర్ గ్రామ రైతులు హాజరై కలెక్టర్‌తో తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ తాత, ముత్తాతలు మాజీ సైనిక ఉద్యోగులు కావడంతో కేంద్ర ప్రభుత్వం కొన్నేండ్ల క్రితం ఫత్తేనగర్ శివారులో 1500 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. నాటి నుంచి భూములను సాగుచేసుకుంటూ వచ్చారన్నారు. అయితే ఈ భూములకు పట్టాలు లేక పోవడంతో బ్యాంకు రుణాలతోపాటు రైతు బంధు, రైతుబీమా తదితర పథకాలు అందక నష్ట పోవాల్సి వస్తుందని వాపోయా రు. భూ భారతి ద్వారా నైనా తమ భూములకు పట్టాలు ఇప్పిం చి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో నవీపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.




మాచారెడ్డిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

# ధాన్యం తూకం వేయడంలేదంటూ రోడ్డెక్కిన రైతులు

మాచారెడ్డి, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకు వచ్చి 15 రోజులు గడుస్తున్నా, తూకం వేయడం లేదని, అధికారులు నిర్ల క్ష్యం వహిస్తున్నారని కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ శ్వేత అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. రైతులు ససేమిరా అనడంతో రెండు రోజుల్లో ధాన్యం తూకం వేస్తామని భరోసా ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. గంటపాటు ఆందోళన చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది

# 'పది' ఫలితాల్లో బాలికలదే పైచేయి

- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు
- కామారెడ్డిలో 94.65 శాతం, నిజామాబాద్‌లో 96.62 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు
- 16 స్థానంలో ఇందూరు, 20స్థానంలో నిలిచిన కామారెడ్డి

కామారెడ్డి / ఖలీల్‌వాడి, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని బాలికలు సత్తాచాటారు. అత్యధిక మార్కులు సాధించి ప్రతిభచాటారు. కామారెడ్డి జిల్లాలో 94.65శాతం, నిజామాబాద్ జిల్లాలో 96.62 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈసారి విడుదలైన పరీక్షా ఫలితాల్లో కామారెడ్డి రాష్ట్రంలో 20వ స్థానానికి పడిపోయింది. మొత్తం 12,542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 11,871 మంది విద్యార్థులు పాసైనట్లు ఇన్‌చార్జి డీఈవో అశోక్ తెలిపారు. బాలురు 93.28, బాలికలు 95.96 శాతం, మొత్తం 94.65 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 22, 694 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 21, 928 మంది విద్యార్థులు (96.62 శాతం) పాసైనట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఫలితాల్లో నిజామాబాద్ జిల్లా 16వ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

### జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారని డీఈవో తెలిపారు.